# ఆర్థిక అవగాహన ప్రచార కార్యక్రమాల మార్గదర్శిక




భారతీయ రిజర్వు బ్యాంకు
గ్రామీణ ప్రణాళిక రచన మరియు పరపతి విభాగం,
కేంద్రకార్యాలయం. ముంబాయి
జనవరి - 2013

# ఆర్థిక అవగాహన ప్రచార కార్యక్రమాల మార్గదర్శిక

(రిజర్వు బ్యాంకు సర్క్యులర్ నెం. ఆర్.పి.సి.డి.ఎఫ్.ఎల్.సి. నెం. 12452/12-01-018/2011-12, జూన్ 6, 2012 తేదీలో సూచించిన నిబంధనల మేరకు జారీ చేయబడినది)

ఈ మార్గదర్శిక లోని అంశాలన్నీ భారతీయ రిజర్వు బ్యాంకు, గ్రామీణ ప్రణాళిక రచన మరియు పరపతి విభాగం, కేంద్ర కార్యాలయం, ముంబాయి వారిచే నిర్దేశించబడిన మార్గదర్శకాలను అనుసరించి, దేశవ్యాప్తంగా, నెల వారీగా ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు మరియు అన్ని గ్రామీణ శాఖలు నిర్వహించబోయే ఆర్థిక అవగాహన శిబిరాల కోసం రూపొందించబడినది.

ఈ మార్గదర్శకాలు www.rbi.org.in లో కూడా అందుబాటులో ఉంచడం జరిగింది.


రచన : సుష్మా విజ్ మరియు గీతా నాయర్

చిత్రాలు : ఆర్. ఎస్. రహోతె

తెలుగులో వెట్టింగ్ చేసినవారు : భారతీయ రిజర్వు బ్యాంకు, హైదరాబాద్.

మొదటి ముద్రణ : జనవరి 2013

**ప్రచురణ కర్తలు**

భారతీయ రిజర్వు బ్యాంకు
గ్రామీణ ప్రణాళిక రచన మరియు పరపతి విభాగం, కేంద్ర కార్యాలయం,
పదవ అంతస్తు, కేంద్రకార్యాలయ భవనం,
షహీద్ భగత్ సింగ్ మార్గ్,
ఫోర్ట్, ముంబాయి - 400 001



**ప్రచురణ హక్కులు**

ఆధారపు వనరు ధృవీకరించినచో పునర్ముద్రణకు అనుమతించబడును.



కృతజ్ఞతలు :

ఎక్షన్ ఇండియా, ఇండియన్ స్కూల్ ఆఫ్ మైక్రోఫైనాన్స్ ఫర్ విమెన్ (ఐ.ఎస్.ఎం.డబ్ల్యు) పరిణామ్ ఫౌండేషన్ మరియు సంచయన్ సొసైటీ వంటి వివిధ వనరుల నుండి సమాచారాన్ని స్వీకరించడం జరిగింది, వారికి కృతజ్ఞతలు.

# ముందుమాట

ఆర్థిక అక్షరాస్యత ద్వారా సామాన్యులు కూడా బ్యాంకులు అందిస్తున్న వివిధ పథకాలు, సేవలను గురించి అవగాహన చేసుకొంటున్నారు. తద్వారా ఆర్థిక సమ్మిళితము వేగవంతమవడమే కాక ఆర్థికపరమైన లావాదేవీలకు, సేవలకు గిరాకీ ఏర్పడుతుంది. సమాజంలోని అన్ని వర్గాలవారికి ఏదో ఒక విధంగా ఆర్థిక అక్షరాస్యత అవసరమే, అయితే ప్రస్తుత సమాజంలో ఆర్థిక సేవలకు దూరంగా ఉన్న అతి పెద్ద వర్గాన్ని పరిగణలోకి తీసుకుని వ్యక్తిగత ఆర్థిక లావాదేవీల గురించి అవగాహనా లోపం వలన నిరంతరం ఆర్థిక వత్తిళ్ళలో చిక్కుకుని సతమతమౌతున్న ప్రజలపై ప్రముఖంగా దృష్టి సారిస్తూ ఈ ఆర్థిక అవగాహనా కార్యక్రమాలను రూపొందించాము. మా లక్ష్యాలు సాధించే క్రమంలో మారుమూల గ్రామాలను సందర్శించినప్పుడు గమనించిన ముఖ్య అంశం, ఆయా ప్రదేశాలలో లక్ష్యంగా ఎంచుకొన్న ప్రజా సమూహాలకు అందించడానికి కనీస స్థాయిలో ప్రామాణిక అంశాలతో కూడిన సమాచారం లేకపోవడం. ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమాలు ప్రభావవంతంగా పనిచేయడానికి ఈ అంశం అవరోధంగా ఉంది. ఎంచుకున్న ప్రజా సమూహాలకు వివిధ పద్ధతులలో అందించే సమాచారంలో ప్రామాణికత సాధించడం ద్వారా లక్ష్య సాధనలో మరింత ఉపయుక్తంగా ఉండేందుకు ఈ మార్గదర్శికను రూపొందించాము. ఈ మార్గదర్శికాలు సామాన్యుల నుండి బ్యాంకింగ్ సేవలకు అపరిమితమైన గిరాకీ తీసుకుని రాగలదని నా విశ్వాసం. ఈ మార్గదర్శిక గ్రామీణ ప్రాంత బ్యాంకు శాఖల మేనేజర్లు మరియు జిల్లా స్థాయిలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు, వారు నిర్వహించే నెలవారీ ఆర్థిక అక్షరాస్యత శిబిరాలలో బోధనకు ఉపయోగపడేవిధంగా రూపొందించబడింది. ఈ మార్గదర్శిక తగిన మార్పులతో, ఆర్థిక సమ్మిళితానికి దూరంగా ఉన్న వివిధ వర్గాల పట్టణవాసులకు అవగాహన కల్పించడానికి కూడా ఉపయోగించవచ్చు. బ్యాంకులు కూడా ఆర్థిక వ్యవహారాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు తమ వినియోగదారులకు స్నేహపూర్వక సేవలను అందించడానికి తమ యంత్రాంగాన్ని సంసిద్ధం చేయవలసిన అవసరం ఉంది. మన ఆర్థిక సమ్మిళిత నమూనాను సుస్థిరమైన, ప్రమాణబద్ధమైన మరియు ఆచరణ సాధ్యమైన వ్యాపార అవకాశంగా అభివృద్ధి చేయడం ద్వారా పేదరికం నుండి ఆర్థిక సాధికారత దిశగా సాగే ప్రయాణంలో, ప్రయోజనకరమైన వ్యాపార అవకాశంగా మలచుకోవడానికి బ్యాంకులకు ఇదే మంచి అవకాశం.

కె.సి. చక్రవర్తి

డిప్యూటీ గవర్నర్

# విషయ సూచిక



| క్రమ సంఖ్య | అంశాలు | పేజి సంఖ్య |
| --- | --- | --- |
| 1. | ఆర్థిక అక్షరాస్యత శిబిరాల నిర్వహణ లక్ష్యం-సూచనలు | i-ii |
| 2. | ఆర్థిక అవగాహన శిబిరాల నిర్వహణ - అమలు పరచడానికి మార్గదర్శకాలు | iii-v |
| 3. | మీ ఆర్థిక వ్యవహారాలను మీరే నిర్వహించుకోండి | 1-6 |
| 4. | పొదుపు | 7-9 |
| 5. | బ్యాంకులలో పొదుపు చేయడం | 10-16 |
| 6. | రుణాలు | 17-18 |
| 7. | బ్యాంకుల నుండి రుణాలను పొందటం | 19-21 |

# ఆర్థిక అక్షరాస్యత శిబిరాల నిర్వహాకులకు - సూచనలు

1. ఆర్థిక అక్షరాస్యత గురించి అవగాహన కలిగించడం మరియు బ్యాంకుల సేవలను సులభంగా అందుబాటులోకి తేవడం అనే రెండు అత్యవసర అంశాల ద్వారా ఆర్థిక సమీకృతానికి అవకాశాలను కలిగించడం, ఈ శిబిరాల నిర్వహణ లక్ష్యం. సామాన్య పౌరులకు ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోవడంలో, పొదుపు అలవాట్లను పెంపొందించడంలో, బ్యాంకులు అందించే ఆర్థిక సేవల పట్ల అవగాహనను మెరుగు పరచడం ద్వారా వారు సమర్థవంతంగా ఆయా సేవలను వినియోగించుకోగల పరిజ్ఞానాన్ని పెంచడమే ఈ శిబిరాల నిర్వహణ లక్ష్యం. సామాన్య పౌరుల జీవనగమనంలో ఏర్పడే ఆర్థిక అవసరాలను ముందుగానే గ్రహించి అందుకు అనుగుణంగా ప్రణాళికను ఏర్పరచుకోవడానికి ఈ అవగాహన తోడ్పడుతుంది. ఇటువంటి అవగాహన వల్ల వారు ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడానికి ముందుగానే సంసిద్ధులై ఉండి అప్పుల వలలో చిక్కుకోకుండా తప్పించుకోగలుగుతారు. ఈ అవగాహనతో బ్యాంకింగు అలవాట్లను పెంపొందించడంతో పాటుగా ఆర్థిక సేవలను కూడా ఏకకాలంలో అందుబాటులోకి తీసుకురావడం వల్ల, సామాన్యులు తమ ఆర్థిక వ్యవహారాలపై నియంత్రణ సాధించడానికి ఈ సమాచారాన్ని సమర్థవంతంగా వినియోగించుకోగలుగుతారు. దీని ఫలితంగా బ్యాంకింగు సేవల సహాయంతో సామాన్యులు తమ ఆర్థిక భద్రతను కూడా పెంపొందించుకోగలగాలి.

2. బ్యాంకులు ఆర్థిక సేవలను అందజేసే సంస్థలుగా ఆర్థిక సమీకృతం మరియు ఆర్థిక అవగాహనలను ప్రచారం చేయడం ద్వారా, అంతవరకూ ఎవరూ స్పృశించని వ్యాపార అవకాశాలపై పట్టును సాధించవచ్చు. చిన్న తరహా ఖాతాదారులే కీలకంగా బ్యాంకులు పిరమిడ్ (సూచ్యగ్రం) అడుగున దాగిన వ్యాపార అవకాశాలకు కళ్లెం వేసి దక్కించుకోవాలి. కాబట్టి, ఆర్థిక అవగాహనకు చేసే ప్రయత్నాలను బ్యాంకులు తమ భవిష్యత్ పెట్టుబడులుగా భావించాలి. చిన్న మొత్తంలో ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం, ఎప్పటికప్పుడు మార్చుకోగలిగే డిపాజిట్ ఖాతాలు, కెసిసి ఖాతా దారులకు బదిలీ వంటి సదుపాయాలతో కూడిన వివిధ సేవల సమాహారాన్ని అందజేయడం ద్వారా ఖాతాదారుల లావాదేవీలను పెంచే ప్రయత్నం చేయాలి. తద్వారా ఈ ఖాతాలను నిర్వహించడానికి బ్యాంకులకు

అయ్యే ఖర్చును తిరిగి రాబట్టుకోగలిగి ఒక ఆచరణ సాధ్యమైన మరియు లాభదాయకమైన వ్యాపారాన్ని బ్యాంకులు నిర్వహించగలుగుతాయి. ఖాతాదారులకు అవసరమైన రుణాలను ఏర్పాటు చేసే సదుపాయం వల్ల, వారికే కాకుండా, బ్యాంకులకు కూడా వడ్డీ రూపంలో వాణిజ్య పరంగా ప్రయోజనం చేకూరుతుంది. బ్యాంకులు, ఖాతాదారులకు లాభం చేకూరే విధంగా మరియు ఏవిధమైన రాయితీ ఇవ్వకుండా సమర్థవంతంగా రుణాలను మంజూరుచేయాలి.

3. బ్యాంకులు కల్పించే అనేక ప్రయోజనాల పట్ల అవగాహన, పరిజ్ఞానాన్ని కలుగజేయడం మరియు ఈ సేవలను ఇంటింటికి అందజేయడం వంటి విధానాలను పాటించడం వలన బ్యాంకులు మొదటి దశలో ఖాతాలను పొందగలుగుతాయి. ఈ ఆర్థిక అవగాహన మార్గదర్శిక ప్రజలకు సులభమైన విధానంలో నగదు యొక్కనిర్వహణ, పొదుపు ప్రాముఖ్యత, బ్యాంకులలో పొదుపు చేయడం వలన లాభాలు, ఇంకా బ్యాంకులు కల్పించే అనేక సదుపాయాలు, బ్యాంకుల నుండి రుణాల స్వీకరణ వంటి ప్రయోజనాలను తెలియజేయడమే లక్ష్యంగా పనిచేస్తాయి. ఈ మార్గదర్శిక ఆర్థిక అక్షరాస్యత మరియు ఆర్థిక సమీకృత కార్యక్రమాలలో పనిచేసే శిక్షకులకు ఒక సత్వర సాధనంగా పనిచేస్తుంది. నెలవారి అవగాహన శిబిరాలలో పాల్గొనలేని వారికి ఈ నివేదిక ఒక ప్రామాణిక పాఠ్యగ్రంథంగా ఉపయోగపడుతుంది. బ్యాంకింగు వ్యవహారాలలో పాల్గొనని వారిని బ్యాంకింగు రంగం పరిధి లోకి తీసుకురావడానికి నిర్వహించే విధానంలోనే ఖాతాలను ప్రారంభించే కార్యక్రమంకూడా ఇమిడి ఉంటుంది. ఈ విధంగా ప్రారంభించిన ఖాతాలలో లావాదేవీలు జరిగేటట్లు చూడాలి. ఈ ఖాతాలను సూక్ష్మంగా పర్యవేక్షించడం వలన లావాదేవీలకు సంబంధించిన సమస్యలను గుర్తించగలము. ఇంకా, ఆర్థిక అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసే సమయంలో స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రభుత్వాధికారులు, ఆయా గ్రామాలలో పలుకుబడి ఉన్న పెద్దలకు కూడా భాగస్వామ్యాన్ని కల్పించడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. సక్రమంగా జరిగేందుకు ఆప్రాంతాన్ని సందర్శించాలి. ఏది ఏమైనప్పటికీ, ఈ మార్గదర్శికలోని అంశాలు నెలవారి ఆర్థిక అక్షరాస్యత శిబిరానికి హాజరు కాలేని సామాన్య ప్రజలకు బ్యాంకింగు వ్యవహారాలను వివరించే ఒక ప్రామాణిక పాఠ్యపుస్తకంగా ఉపయోగపడుతాయి.

## ఆర్థిక అవగాహన శిబిరాల నిర్వహణ -అమలు పరచడానికి మార్గదర్శకాలు

అన్ని ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలలోని బ్యాంకుల శాఖలు, శిబిరాలను నిర్వహించడానికి వీలుగా, ఆయా ప్రాంతాల వివరాలతో ఒక వార్షిక క్యాలండరును తయారు చేసుకోవాలి. ప్రతి ప్రాంతంలో ఈ కార్యక్రమం మూడు నెలల కాలంలో, మూడు దశలలో, మూడు సమావేశాలలో, ఒక్కొక్క సమావేశం  నిడివి రెండు గంటలు ఉండేట్లుగా నిర్వహించాలి. ఇంటింటికి కార్డులు పంచే కార్యక్రమం. సక్రమంగా జరిగేందుకు ఆ ప్రాంతాన్ని సందర్శించాలి. ముందుగా సరైన ప్రాంగణం లేదా బహిరంగ స్థలాన్ని ఈ కార్యక్రమ నిర్వహణ కోసం గుర్తించాలి. అందుబాటులో ఉన్న వనరులను బట్టి బ్యాంకులు ఆయా ప్రాంతాలు అవసరానికి తగినట్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అన్ని సందర్భాలలోను, బ్యాంకింగు రంగం లోకి ఎక్కువమందిని భాగస్వాములుగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలి.

### మొదటి సమావేశం :

- మొదటి సమావేశంలో ప్రజలకు ఆర్థిక లావాదేవీల పట్ల అవగాహన కల్పించడం, వ్యక్తిగత ఆర్థిక వ్యవహారాలు, నగదు నిర్వహణ పై ప్రధానంగా దృష్టిని సారించాలి. ఇందుకోసం బ్యాంకు, గ్రామస్థుల బృందంతో ఒక శిబిరాన్ని నిర్వహించాలి. ఈ శిబిరం నిర్వహణ గురించి గ్రామంలో ముందుగానే ప్రచారం చేయడం ద్వారా ఎక్కువ మంది గ్రామస్థులు కార్యక్రమానికి హాజరయ్యేట్లుగా చేయాలి.

- ఈ విధంగా నిర్వహించే శిబిరంలో ఆ ప్రాంతంలో స్థానికంగా పలుకుబడి కలిగి ఉన్న ప్రముఖ వ్యక్తులను, గ్రామ సర్పంచి, పాఠశాల ఉపాధ్యాయులు లేదా గ్రామస్థులతో సత్సంబంధాలు కలిగి ఉన్న ఇతర వ్యక్తులను భాగస్వాములను చేయాలి. సమావేశ ప్రాంతంలో కార్యక్రమ నిర్వహణకు అవసరమైన అన్ని అందరికి తెలిసేటట్లుగా ఏర్పాట్లను చేయాలి.  ఈ సమావేశానికి హాజరయ్యే వ్యక్తులు రాకముందే సంబంధిత అన్ని పోస్టర్లను ఆప్రాంతంలో ప్రదర్శించాలి.

- కార్యక్రమంలో పాల్గొనే వారి పేరు, వయస్సు, వృత్తి మొదలైన వివరాలతో ఒక జాబితాను తయారు చేయాలి.

- కార్యక్రమంలో వివరించే అంశాలలో, ఆర్థిక ప్రణాళిక, ఆర్థిక అంచనాలు, పొదుపు, ఆర్థిక వ్యవహారాల డైరీని వ్రాసే విధానం, బ్యాంకులలో పొదుపు చేయడం వల్ల లాభాలు, వ్యాపార ప్రతినిధి పాత్ర, క్రమబద్ధమైన మరియు క్రమబద్ధంకాని రుణాల వనరుల మధ్య వ్యత్యాసం, రుణాలు తీసుకోవడానికి కారణాలు, రుణ స్వీకరణకు అయ్యే ఖర్చులు, అనేక రకాల రుణాల స్వీకరణ మధ్యతేడాలు వంటి అంశాలను మార్గ దర్శక కరదీపికలో  పేర్కొన్న విధంగా వివరించి చెప్పాలి.

- కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఒక ఆర్థిక డైరీని అందజేయాలి.

- ఈ ఆర్థిక డైరీని, ఖర్చు అంచనా మరియు కాల వ్యవధితో కూడిన జాబితాను తయారుచేయడానికి ఏ విధంగా ఉపయోగించవలసింది వివరించాలి. ఆర్థిక డైరీ ఉపయోగాలు వినియోగించే విధానాన్ని మళ్ళీ మళ్ళీ వివరించి చెప్పాలి. వారి ఇళ్ళల్లో ఖర్చుల అంచనాలను, ఆదాయ వివరాలను మరియు ఒక నెలకు సంబంధించిన ఆదాయ వ్యయాలను డైరీలో నమోదుచేయుమని వారిని అడగాలి. తరువాత

సమావేశానికి వచ్చేటప్పుడు వారివెంట డైరీని తీసుకు రావలసిందిగా కోరాలి.

- మొదటి సమావేశం ముగింపు సమయంలో గ్రామస్థులకు తరువాత సమావేశాన్ని నిర్వహించే తేదీని ప్రకటన ద్వారా తెలియజేసి, రెండవ సమావేశం సమయంలో వ్యాపార ప్రతినిధిని పరిచయం చేస్తామని తెలియజేయాలి. వ్యాపార ప్రతినిధి ద్వారా ఖాతాలను ప్రారంభించాలన్న విషయాన్ని గ్రామస్థులకు తెలియజేయాలి. ఖాతాలను ప్రారంభించడానికి అవసరమైన పత్రాలను గ్రామస్థులకు తెలియపరచి, తదుపరి సమావేశనికి హాజరయ్యేటప్పుడు ఆ పత్రాలను తీసుకు రావలసిందిగా కోరాలి. సమావేశానికి హాజరైన వారందరికీ తదుపరి సమావేశానికి తప్పక హాజరు కావాలన్న సమాచారాన్ని స్పష్టంగా తెలియపరచాలి.
- గ్రామపంచాయితీ లేదా కార్యాలయం లేదా పాఠశాల వంటి ఉమ్మడి స్థలాలలో శాశ్వతంగా గ్రామస్థులు చదువుకోవడానికి వీలుగా ఉండేటట్లుగా అన్ని పోస్టర్లను అతికించాలి.

## రెండవ సమావేశము :- (మొదటి సమావేశం తరువాత పదిహేను రోజులకు నిర్వహించాలి)

- హాజరుపట్టికలో హాజరును గుర్తించాలి. ఎవరైనా సమావేశానికి గైరుహాజరైతే కారణాలను తెలుసుకోవాలి. వ్యాపార ప్రతినిధిని గ్రామప్రజలకు పరిచయంచేసి, ఆ ప్రతినిధికి, బ్యాంకుకూ గల సంబంధాన్ని వివరాలతో సహా తెలియజేయాలి. వ్యాపార ప్రతినిధి ద్వారా బ్యాంకు లావాదేవీలను నిర్వహిస్తే కలిగే లాభాలను గురించిన వివరాలు, వివిధ డిపాజిట్ ఖాతాలు, వ్యాపార ప్రతినిధి ద్వారా అందుబాటులోకి రాగల రుణ సౌకర్యాలు వంటి లావాదేవీల గురించి వివరంగా తెలియజేయాలి.
- హాజరైన వారికి ఐ.సి.టి. పరికరం ఏ విధంగా పనిచేస్తుందో ప్రయోగాత్మకంగా  చూపి, అ పరికరం యొక్క ప్రతి ఒక్క భాగాన్ని గురించి వివరించాలి. ఉదాహరణకు డిపాజిట్ చేసినప్పుడు / నగదును తీసినప్పుడు ఆ యంత్రం ఏ విధంగా పనిచేస్తుందో వివరించాలి.
- ప్రతి ఒక్కరి ఆర్థిక డైరీని పరిశీలించాలి. వారు వ్రాయడంలో ఏవైనా ఇబ్బందులను ఎదుర్కొంటుంటే, ఆ అంశాన్ని తెలుసుకోవాలి. అవసరమైతే వారి పొరపాట్లను సరిదిద్దే సలహాలను ఇవ్వాలి. ప్రతినెలా క్రమం తప్పకుండా డైరీని వ్రాయవలసిందిగా వారికి సలహాను ఇవ్వాలి.
- ఒక నెలలో చేయదగిన డిపాజిట్లు / విత్ డ్రాయల్‌ల సంఖ్య మరియు పరిమితులు ఏవైనా ఉన్నట్లైతే వాటి గురించి బ్యాంకు విధించే రుసుములు, సామాజిక ప్రయోజనాలను నేరుగా వ్యక్తిగత ఖాతాలోకి జమచేసే విధానం, ఖాతాదారులకు చేయవలసిన వివిధ చెల్లింపులు, ఖాతాల ద్వారా అందుకోవలసిన నగదు స్వీకరణలు మొదలైన ఖాతాల లక్షణాలను గురించి వివరించాలి.
- ఖాతాలను ప్రారంభించడానికి వీలుగా పేర్ల నమోదును ప్రారంభించాలి. ఖాతాదారుల పేర్ల జాబితా తయారు చేసిన అనంతరం, దాదాపుగా ఖాతాలు ప్రారంభించడానికి, కార్డులు జారీ చేయడానికి పట్టే సమయాన్ని తెలియజేయాలి. ఖాతాదారు కార్డును పొందిన వెంటనే అవసరాల కోసం వారు ఖాతాలను ఉపయోగించుకొనేందుకు సలహాలను అందించాలి.

- రెండవ సమావేశం ముగిసిన 15 రోజుల తరువాత, బ్యాంకు యొక్క శాఖల అధికారులు గ్రామాన్ని సందర్శించి, గ్రామస్థులు అందరూ కార్డులు పొందారో లేదో, బ్యాంకు ప్రతినిధి(బి.సి.) తన కార్యకలాపాలను ప్రారంభించిందీ లేనిదీ, గ్రామస్థులు వారి లావాదేవీల కోసం ఖాతాను వాడుకోగలుగుతున్నారా, లేదా అన్న అంశాన్ని నిర్ధారించుకోవాలి.

**మూడవ సమావేశం :- (రెండవ సమావేశం జరిగిన తరువాత 2 నెలలకు నిర్వహించాలి)**

- గత సమావేశంలో ఖాతా ప్రారంభం కోసం తమ పేర్లను నమోదు చేసుకున్న గ్రామస్థులతో ఒక సమావేశాన్ని నిర్వహించాలి. బ్యాంకు ప్రతినిధి(బి.సి.) మరియు గ్రామస్థులతో పరస్పర సంబంధాలను గురించి సమావేశం నిర్వహించాలి.

- గ్రామస్థులు ఖాతాలను నిర్వహించడంలో లేదా ఐసిటి పై ఆధారపడిన వ్యవస్థను ఉపయోగించడంలో ఏవైనా ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లైతే, వాటిని వారికి వివరించాలి. పై అంశాలను మెరుగు పరచడంలో గ్రామస్థుల సలహాలను కోరాలి.

- ఖాతాలను వినియోగించే అంశాన్ని సమీక్షించడం ద్వారా ఖాతాల వినియోగంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లైతే గమనించాలి.

- పై అంశాలతో పాటుగా ఒక క్రమబద్ధమైన వ్యవస్థ ద్వారా లావాదేవీల స్థాయిని అమలు చేస్తున్న విషయాన్ని తెలియపరచాలి.

********************

# మీ ఆర్థిక వ్యవహారాలను మీరే నిర్వహించుకోండి

## ఆదాయం అంటే ఏమిటి?

జీతం, వేతనాలు వ్యవసాయం లేదా వ్యాపారం మొదలైన కార్యకలాపాల నుండి వచ్చే సంపాదన మన ఆదాయం.

## ఖర్చు అంటే ఏమిటి?

వివిధ అవసరాలపై వెచ్చించిన నగదు, మన ఖర్చులు. ఈ ఖర్చులలో అవసరమైనవి మరియు అనవసరమైనవి ఉంటాయి.

**మన ఖర్చులను మనం ఒకసారి అవగాహన చేసుకునే ప్రయత్నం చేద్దాం.**

| ఆదాయం (నగదు వనరు) | మొత్తం (రూ) |
|---|---|
| జీతం లేదా వేతనాలు | 2,000-00 |
| వ్యవసాయం నుండి వచ్చే ఆదాయం/ వ్యాపారం నుండి వచ్చే ఆదాయం | 3,000-00 |
| మొత్తం | 5,000-00 |

| ఖర్చులు (నగదు వినియోగాలు) | మొత్తం (రూ) |
|---|---|
| ఆహారం, ఇల్లు, బట్టలు | 2,000-00 |
| చదువు | 1,000-00 |
| అప్పు తీర్చడానికి వెచ్చించే మొత్తం | 700-00 |
| అనారోగ్యం | 300-00 |
| మద్యం, మాదకద్రవ్యాలు, గుట్కా, | 500-00 |
| జూదం | 400-00 |
| వివాహాలు, పండుగలు, తీర్థయాత్రలు మొదలైన వాటిపై చేసే అదనపు ఖర్చులు | 1.100-00 |
| మొత్తం | రూ. 6,000-00 |




## పెట్టుబడి అంటే ఏమిటి?

నిర్ణీత సమయంలో, ఎక్కువ ఆదాయం సంపాదించాలనే ఆలోచనతో తన పొదుపు మొత్తం నుంచి వెచ్చించే మొత్తాన్నే పెట్టుబడి అంటారు.


ఉదాహరణకు : భూమి కొనుట, బ్యాంకులలో ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పొదుపు చేయుట.

## పొదుపు అంటే ఏమిటి?


ఖర్చుల కంటే ఆదాయం ఎక్కువగా ఉన్నట్లైతే, మనవద్ద ఉన్న మిగులు మొత్తాన్ని పొదుపు సొమ్ము అంటారు.

## అప్పు అంటే ఏమిటి?

ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువగా ఉండి, మనవద్ద ఎటువంటి పొదుపు సొమ్ము లేనప్పుడు, నగదు అవసరానికి తగినంతగా లేనప్పుడు, ఇతర వనరుల ద్వారా అప్పు చేసి రుణగ్రస్తులుగా మారతాం.




| ఆదాయం | ఖర్చులు | ఫలితం | చర్య |
|---|---|---|---|
| రూ. 5,000 | రూ. 4,000 | మిగులు రూ.1,000 | కదలిక రావాలి |
| రూ. 5,000 | రూ. 5,000 | మిగులు-లేదు<br>లోటు - లేదు | ఆలోచించాలి |
| రూ. 5,000 | రూ. 6,000 | లోటు - రూ. 1,000 | ఆగాలి |




## రుణ నిర్వహణ ఏ విధంగా చేయాలి?

ఏదైనా ఒక నెలలో మన ఖర్చులు మన ఆదాయానికి మించి ఉన్నట్లైతే, గత నెలలలో మనం పొదుపు చేసి దాచిన సొమ్మును ఆదాయం లోటును భర్తీ చేయడానికి వినియోగించవచ్చు. మనవద్ద ఎటువంటి పొదుపు సొమ్ము లేనట్లైతే ఇతరుల వద్దనుండి తీసుకున్న నగదుతో లోటును పూడ్చుకోవటానికి ఎక్కువ వడ్డీని చెల్లించి అప్పును తీసుకోవలసి ఉంటుంది.

ఇది పూర్తిగా మన నిత్య జీవితంలో నీటిని ఉపయోగించే విధానాన్ని పోలి ఉంటుంది. కొన్ని సార్లు మున్సిపాలిటీ వారు నీటిని రోజంతా వదులుతారు. మరికొన్ని సార్లు అసలే నీటిని వదలకపోవచ్చు. మనం నీటిని వినియోగించడం మానేస్తామా? లేదు. మనం నీటి వాడకం మానెయ్యలేము. ఎక్కువగా నీటిని వదిలినప్పుడు మనం పాత్రలలో పట్టి భద్ర పరచుకొని, అవసరానికి నీరు లేనప్పుడు వాడుకుంటూ ఉంటాం. దీనినే పొదుపు అంటాం. మన ఆర్థిక వనరులు అడుగు భాగం నుండి నీరు బయటకు ప్రవహించే ఏర్పాటు ఉన్న, కుళాయి ఉన్న, ఒక కుండ వంటివి. కుండలోకి వచ్చిపడే నీరు మన ఆదాయం, కుండ నుండి బయటకు ప్రవహించే నీరు మన ఖర్చులు.

**అనవసరమైన ఖర్చులను తగ్గించి మీ పొదుపును పెంచండి.**

## అవసర ఖర్చులు, అనవసర ఖర్చుల మధ్య తేడా ఏమిటి?

మన మౌలిక అవసరాల కోసం వెచ్చించే నగదు అవసరమైన ఖర్చుగా పరిగణించబడుతుంది. ఇటువంటి అవసరాలకు మనం ఖర్చు పెట్టక తప్పదు. ఉదహారణకు ఆహారం, ఆరోగ్యం, దుస్తులు, పిల్లల చదువులు మొదలైనవి. మన కోరికలను తీర్చుకోవడానికి వెచ్చించే నగదు అనవసర ఖర్చుగా పరిగణించబడుతుంది. మనం బ్రతకడానికి ఇటువంటి వస్తువుల అవసరం లేకపోయినప్పటికి మనం ఇష్టపడతాం. వాటివల్ల ఆనందం పొందుతాం.


## మనం నగదును ఏ విధంగా నిర్వహించాలి?

ఆర్థిక ప్రణాళికను రూపొందించడం ద్వారా మన డబ్బును మనం సమర్థవంతంగా నిర్వహించవచ్చు. ఆర్థిక ప్రణాళికలో మొదటి అడుగుగా ఒక నిర్ణీత కాల వ్యవధిలో అంటే ఒక నెలకు లేదా ఒక వారానికి మనం మన ఆదాయం మరియు ఖర్చుల ఖాతాలను ఆర్థిక డైరీలో వివరంగా వ్రాసుకోవాలి.

## ఆర్థిక ప్రణాళిక అంటే ఏమిటి?

మన జీవితం మొత్తం మీద మన ఆర్థిక అవసరాలను అంచనా వేసి వాటినితీర్చే అభ్యాసంగా దీనిని చెప్పవచ్చు. ఉదాహరణకు బిడ్డ పుట్టుక, చదువు, ఇంటికొనుగోలు, వివాహం, విత్తనాల కొనుగోలు మొదలైనవి లేదా ఆకస్మిక ప్రమాదం, వరదలు, కరువు వంటి ప్రకృతి వైపరీత్యాల వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడం మొదలైనవి, ఈ కోవలోకి వస్తాయి.

## మనం ఎందుకు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవాలి ?




ఆర్థిక ప్రణాళిక మన ఆదాయ స్థాయిని, రాబోయే ఖర్చులను ముందుగానే అంచనా వేయడానికి తోడ్పడుతుంది. ఇది రెండు రకాలుగా మనకు సహాయ పడుతుంది. ఒకటి - మనం ప్రతిరోజు క్రమం తప్పకుండా మన ఆదాయంలో కొంత భాగాన్ని భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేయడం. రెండవది మన భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఖర్చులను తగ్గించుకోవడం. కాబట్టి మనం ఈ రోజే ఆర్థిక ప్రణాళికను రూపొందించడం ప్రారంభించినట్లైతే మనం మన అప్పులను తీర్చివేసి, స్వంత ఇంటికోసం లేదా ఉన్నత విద్య కోసం పొదుపు చేసిన డబ్బును వెచ్చించవచ్చు.

### ఆర్థిక ప్రణాళిక ద్వారా మీ లక్ష్యాన్ని సాధించండి.

## ఆర్థిక ప్రణాళికను ఏ విధంగా రూపొందించాలి?


- మన ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని అంచనా వేయండి (ఈ రోజు మనం ఏ స్థితిలో ఉన్నాం?)
- మన ఆర్థిక అవసరాలను గుర్తించండి(మనం ఏం సాధించాలనుకుంటున్నాం?) స్వల్ప కాలంలో (ఒక సంవత్సరం), మధ్యకాలిక వ్యవధిలో (1 నుండి 5 సం॥ ) దీర్ఘకాలిక వ్యవధిలో (5 సంవత్సరాల కంటే ఎక్కువ)
- మన లక్ష్యాన్ని ఏ తేదీలోగా సాధించాలి? మనం ప్రతివారం / ప్రతినెలా అందుకోసం ఎంత పొదుపు చేయాలి?
- ఒక ఆర్థిక డైరీని నిర్వహించండి. వారానికి / నెల వారీగా ఆదాయం మరియు ఖర్చులను అందులో రాయండి.
- ఖర్చులను తగ్గించండి - తెలివిగా ఖర్చు పెట్టండి.
- పొదుపును క్రమం తప్పకుండా సమీక్షించండి - పొదుపు ప్రణాళికాబద్ధం గానే ఉందా? లేనట్లయితే అవకాశం ఉన్నచోట్ల ఖర్చులను తగ్గించుకుంటూ పొదుపు సొమ్మును పెంచండి.
- ప్రతి వారం / నెల ముగింపులో పొదుపు చేసిన మొత్తాన్ని నిర్థారించండి.
- పొదుపు చేసిన సొమ్మును బ్యాంకు ఖాతాలో వేయండి.

## ఆర్థిక డైరీని ఎందుకు నిర్వహించాలి?

ఆర్థిక డైరీ మనకు ఆర్థిక ప్రణాళికను రూపొందించడానికి తోడ్పడుతుంది. ఎంపిక చేయబడిన నెలలో మనం అవసరమైన వస్తువులపై పెట్టే ఖర్చు, అనవసర వస్తువులపై పెట్టే ఖర్చును తెలుసుకోవచ్చు. ఈ డైరీ మనం ఏయే వస్తువుల సేవల కోసం వెచ్చించే ఖర్చును తగ్గించుకోవచ్చో గుర్తించడానికి తోడ్పడుతుంది. ఒకసారి మనం ఈ విషయాన్ని తెలుసుకోగలిగితే, ఈ ఖర్చులను మనం క్రమబద్ధీకరించుకొని డబ్బును దాచుకోవడానికి వీలు కలిగి, పేదరికం అనేది చాలా వరకు తగ్గుతుంది.

## ఖర్చు పెట్టే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి.

ఉదాహరణకు మన నెలవారీ ఆదాయం రూ॥ 5,000 అనుకుందాం. ఆర్థిక డైరీని నిర్వహించడం ద్వారా మనం మన ఖర్చుల గురించి తెలుసుకోవచ్చు. అవి ఆహారం, ఇల్లు, బట్టలు (రూ॥ 2,000 /- ) పిల్లల చదువులు (రూ॥ 1,000) అద్దె (రూ॥ 700) మరియు అనారోగ్యం (రూ॥ 300) పండుగలు, తీర్థయాత్రలు వంటి వాటిపై చేసే ఖర్చు (రూ॥ 500) మద్యం మరియు జూదం (రూ॥ 500). మనం పండగలు, తీర్థయాత్రలు వంటి వాటిపై చేసే ఖర్చులు రూ॥ 500 నుండి రూ॥ 200 ల వరకు, మరియు మద్యం వంటి దురలవాట్లపై చేసే ఖర్చును పూర్తిగా తగ్గించుకోవచ్చు. అప్పుడు మనం 800 రూపాయలను పొదుపు చేయ గలుగుతాం. ఆర్థిక డైరీని నిర్వహించడం వల్ల ఈ విధంగా మనం డబ్బును పొదుపు చేయగలిగాము.





ఆర్థిక డైరీ కనుక లేక పోయినట్లయితే మన చేతిలో ఉన్న డబ్బును మనం లెక్కలేకుండా ఖర్చుపెట్టి ఉండేవాళ్ళం.

## మనం ఖర్చును ఏవిధంగా తగ్గించుకోవాలి?

మనం కొన్ని అదనపు వస్తువుల, సేవలమీద పెట్టించే ఖర్చును అవసరమైనంత మేరకు తగ్గించుకోవచ్చు. ఇందువల్ల అయిన పొదుపు, మనం అదనంగా డబ్బును సంపాదించినట్లే. ఈ సొమ్మును అవసరం వున్న వస్తువులపై అదనంగా ఖర్చు పెట్టవచ్చు దీన్ని మనం చాలా సులభంగా అర్థంచేసుకోవచ్చు.

ఉదాహరణకు మనం ప్రతిరోజు 4 కప్పుల టీని తాగుతూ ఉన్నట్లైతే, గత 30 రోజులలో (1నెల) మనం 120 కప్పుల టీని త్రాగి ఉంటాం. ప్రతి ఒక్క కప్పు టీ రూ॥ 5/- గా అనుకున్నట్లయితే మొత్తం టీ ఖర్చు నెలకు రూ॥ 600/- అవుతుంది. ఒక్కసారి ఆగండి. ఒక రోజుకు మనం నాలుగు కప్పుల టీ త్రాగడం అవసరమా? అని ఆలోచించండి. మనం రోజుకు రెండు కప్పుల టీ ని మాత్రమే త్రాగుతూ ఉన్నట్లయితే ఈ ఖర్చు రూ॥ 300/- లకు తగ్గి మనం ఆ రూ॥ 300/- లను పొదుపు చేయడం జరుగుతుంది. ఇక్కడ నాల్గు కప్పుల టీ అనేది మన కోరిక. అయితే 2 కప్పుల టీ తో మాత్రమే మన అవసరం తీరుతుంది. మరొక విధంగా చెప్పాలంటే మన ఆదాయం నెలకు రూ॥ 300/- ల చొప్పున పెరుగుతూ ఒక సంవత్సరంలో మనం రూ॥ 3600/- లను పొదుపు చేయగలిగాము




మీ సొంత డబ్బును ఈ విధంగా ఖర్చు చేయండి


చదువు



వ్యాపారం

**డబ్బును పొదుపు చేయడం అంటే డబ్బును సంపాదించడమే**

# పొదుపు

## మనం ఎందుకు పొదుపు చేయాలి?

మనం క్రమబద్ధంగా పొదుపు చేసినట్లయితే మన ఖర్చులు మన ఆదాయాన్ని మించిన పరిస్థితిలో, మనకు ఎక్కువ మొత్తంలో డబ్బు అవసరమైనప్పుడు పొదుపు సొమ్మును వినియోగించుకోవచ్చు.




- బిడ్డ పుట్టుక, చదువు, ఇంటి కొనుగోలు, వివాహం, విత్తనాల కొనుగోలు లేదా స్వంత ఇంటి కొనుగోలు వంటి ఎక్కువ ఖర్చుతో కూడిన అవసరాలను తీర్చుకోవడానికి.
- అనారోగ్యం, ఆకస్మిక ప్రమాదం, మరణం, ప్రకృతి విపత్తుల వంటి అనుకోని ఏవైనా సంఘటనలు ఎదురైనప్పుడు ఆపదనుండి బయటపడటానికి, అత్యవసర పరిస్థితులలో
- మనం డబ్బు సంపాదించుకోలేని సమయంలో
- మన ముసలితనంలో డబ్బు అవసరాలకు
- మనకు ప్రతినెల వచ్చే ఆదాయంతో మనం ఒక వస్తువును కొనలేని పరిస్థితిలో మనకు డబ్బు కావలసివచ్చినప్పుడు, పొదుపు సొమ్ము మనను ఆదుకొంటుంది.

క్లుప్తంగా చెప్పాలంటే, మనం సంపాదించిన మొత్తం కంటే ఎక్కువ మొత్తంలో ఖర్చు పెట్టవలసి వచ్చినప్పుడు మనవద్ద చాలినంత పొదుపు సొమ్ము వున్నట్లైతే ఆ ఖర్చులను సులభంగా భరించగలం.

## ఎలా పొదుపు చేయాలి ?

మనం మన ఖర్చును తగ్గించుకోవడం లేదా మన ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా పొదుపు చేయవచ్చు. మనం అవసరమైన లేదా అనవసరమైన వస్తువులను కొనడానికి డబ్బును ఖర్చు చేస్తూ ఉంటాం. ఆహారం, దుస్తులు, ఇల్లు మరమ్మత్తులు, విత్తనాల కొనుగోలు మరియు వ్యవసాయ పనిముట్ల కొనుగోలు, పిల్లల చదువు, మరియు ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలు లేకుండా మనం జీవించలేం. అందువల్ల వాటిని నిత్యావసరాలుగా గుర్తించవచ్చు. ఇవి లేకుండా మనం జీవనాన్ని కొనసాగించలేం. అనవసర వస్తువుల విషయానికి వస్తే ఈ వస్తువులు మన జీవితంలో అదనపు వస్తువులుగా భావించబడి మనకు ఆనందాన్ని కలిగించేవి తప్ప అవసరాలను తీర్చేవి కావు. ఇటువంటి వస్తువులపై పెట్టే ఖర్చును తగ్గించ వచ్చు లేదా

వాయిదా వేసుకోవచ్చు. ఉ॥ మద్యం, మాదక ద్రవ్యాలు, గుట్కా, జూదం, వంటి వాటిని పూర్తిగా మానివేయవచ్చు. అదే విధంగా వివాహం, పండుగలు, తీర్థయాత్రలపై పెట్టే అదనపు ఖర్చును తగ్గించుకోవచ్చు మరియు టీవి, స్కూటర్, కారు, నగలు మొదలైన వాటిపై పెట్టే ఖర్చును వీలైతే వాయిదా వేసుకోవచ్చు. మనం అనవసర వస్తువులపై ఖర్చును ఎంత తగ్గించుకుంటే అంత ఎక్కువగా మనం అవసరమైన వస్తువులకోసం పొదుపు చేయవచ్చు.

## మన రోజువారి ఖర్చులకే సరి పడేంత డబ్బు మనవద్ద లేనప్పుడు మనం ఏ విధంగా పొదుపు చేయగలుగుతాం?

మనం తగినంత డబ్బును సంపాదించడం లేదు కాబట్టి మనం పొదుపు చేయలేం అనేది ప్రతివారు సాధారణంగా పాడే పల్లవి అయిపోయింది. నిజానికి ప్రతి ఒక్కరికీ పొదుపు చేయవలసిన అవసరం ఉంది. పొదుపు చేసే అవకాశం కూడా ఉంది. మనం సంపాదించడం మొదలు పెట్టిన మొదటి రోజు నుండీ మన ఆదాయంలో కొంత భాగాన్ని ప్రక్కకు పెట్టాలి. ముఖ్యమైన విషయం ఏమిటంటే, మనం మన జీవితంలో ఎంత చిన్న మొత్తాన్నైనా సరే ఆరంభం నుండీ క్రమం తప్పకుండా పొదుపు చేయాలి. అనుకోని విధంగా మనకు లాభం కానీ అదనంగా ఆదాయం కాని వచ్చినట్లైతే మనం ఆ మొత్తం అంతటినీ లేదా అందులో అత్యధిక భాగాన్ని పొదుపు చేయాలి. ఈ విధంగా చేయడం వల్ల మనకు మన భవిష్యత్తు ఆర్థిక అవసరాల పట్ల ఆందోళనలు తగ్గి, అనుకోని ఖర్చులు ఎదురైనప్పుడు సర్దుబాటు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

మనం రూ॥ 100/- లను సంపాదించామనుకుందాం. మనం రూ॥ 20/- ల ను పొదుపు చేయవచ్చు. అదే మన సంపాదన రూ॥ 10/- అయినట్లైతే మనం రూ॥ 2/- లను పొదుపు చేయవచ్చు. మనం సంపాదించిన రూ॥ 100/- నుండి రూ॥ 20/-లను పక్కన పెట్టినట్లైతే అయిదు సంపాదన దినాలలో మనం ఒక రోజు ఆదాయాన్ని పొదుపు చేయవచ్చు. 100 సంపాదన దినాలలో 20 సంపాదన దినాల ఆదాయం మరియు వడ్డీని మనం పొదుపు చేయవచ్చు. ఇది అద్భుతమైన విషయమైనప్పటికి అసంభవం కాదు కదా !!

| | |
|---|---|
| ఒక రోజు ఆదాయం | రూ॥ 100/- |
| ఒక రోజు ఖర్చు | రూ॥ 80/- |
| ఒక రోజు పొదుపు | రూ॥ 20/- |
| ఒక నెలకు పొదుపు | రూ॥ 20/-X30= రూ॥ 600/- |
| ఒక సంవత్సరంలో పొదుపు | రూ॥ 600X12=7,200/- |
| సంవత్సరానికి 8% చొప్పున వడ్డీ | రూ॥ 318/- |
| సంవత్సరాంతంలో పొదుపు సొమ్ము | రూ॥ 7,518 |
| ఈ మొత్తం 75 రోజుల ఆదాయానికి సమానం | |

## ఇలా ఎంతకాలం మనం పొదుపు చేయాలి?

మనం ఎంత ఎక్కువ కాలం పొదుపు చేస్తే మన పొదుపు సొమ్ము అంతగా పెరుగుతుంది. ఈ విధంగా పొదుపు చేసిన సొమ్ము మనకు అత్యవసర పరిస్థితులలో, వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటుంది. దీని వలన ఇతరులపై ఆధారపడటం, అప్పుచేయడం లాంటి సమస్యలు లేకుండా ఆత్మ స్థైర్యంతో అన్ని పరిస్థితులకు సంసిద్ధులవుతాం. మన పొదుపు సొమ్ము పెరుగుతూ ఉంటే మనం మన అవసరాలకోసం అప్పులు చేసే పరిస్థితి రాదు.

| | | | |
|---|---|---|---|
| ప్రతి సంవత్సరం పొదుపు చేసిన సొమ్ము | రూ॥ 1000 | రూ॥ 1000 | రూ॥ 1000 |
| పొదుపు చేసిన సంవత్సరాల సంఖ్య | 40 | 30 | 20 |
| మన పొదుపు మొత్తం | రూ॥ 40,000 | రూ॥ 30,000 | రూ॥ 20,000 |
| పొదుపుపై సంవత్సరానికి 10% చొప్పున వడ్డీ | రూ॥ 4,22,878 | రూ॥ 1,42,033 | రూ॥ 39,900 |
| మనకు 65 సంవత్సరాల వయస్సు సమయానికి మొత్తం పొదుపు సొమ్ము | రూ॥ 4,62,878 | రూ॥ 1,72,033 | రూ॥ 59,900 |

దీర్ఘకాలికంగా మనం పొదుపు చేసినట్లైతే, మన పొదుపు సొమ్ము పై వడ్డీ పెరిగి అసలు అనేక రెట్లవుతుంది.

# బ్యాంకులలో నగదును పొదుపు చేయడం

## ఎక్కడ పొదుపు చేయాలి?




మనం పొదుపు చేసిన సొమ్మును దిండు క్రింద లేదా పరుపులో దాచి పెడతాం. మనం ప్రతి నిముషం దాచిన సొమ్మును గురించి ఆందోళన చెందుతూ ఉంటాం. మనం కష్టపడి సంపాదించిన డబ్బు కొన్నిసార్లు ఎలుకలు, క్రిమికీటకాల పాలయ్యే ప్రమాదం వుంది. ఎవరైనా దాన్ని దొంగిలించవచ్చు లేదా మనమే దాన్ని ఖర్చు పెట్టాలన్న ప్రలోభానికి లోను కావచ్చు లేదా ఇతరులు ఎవరైనా మనను అప్పుగా ఇవ్వవలసిందిగా అడగవచ్చు. ఇంట్లో దాచిపెట్టిన మొత్తం పెరిగే అవకాశం లేదు.

పొదుపు సొమ్మును దాచుకొనే చక్కని మార్గం దానిని బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేయడం. చిన్న మొత్తాలను పరుపులో దాచి ఉంచే కంటే వాటిని పొదుపు ఖాతాలో వేయడం తెలివైన పని.

**మీరు కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకోకండి. ఎల్లప్పుడు మీ సొమ్మును బ్యాంకు ఖాతాలో పొదుపు చేయండి.**


## ఎందుకు బ్యాంకు ఖాతాలో పొదుపు చేయాలి?

పొదుపు చేయడం ద్వారా బ్యాంకులలో దాచిన డబ్బు భద్రంగా ఉండి, మన జాతీయాభివృద్ధికి వినియోగించబడుతుంది. డబ్బుకు భద్రత కల్పించడమే కాకుండా బ్యాంకులో డిపాజిట్ చేసినందుకు గాను బ్యాంకులు ఎటువంటి రుసుముగూ వసూలు చేయవు. మరొక వంక బ్యాంకులు మనం జమ చేసిన డిపాజిట్లకు వడ్డీ రూపంలో సొమ్మును చెల్లిస్తాయి. కాబట్టి బ్యాంకులో దాచిన పొదుపు సొమ్ము వృద్ధిచెందుతుంది. అంతేకాకుండా మన సొమ్మును బ్యాంకులో దాచడం వలన మనకు అవసరం అయినప్పుడు ఆ డబ్బును తీసి వాడుకోవచ్చు. బ్యాంకు లావాదేవీలు చాలా పారదర్శకంగా ఉంటాయి. బ్యాంకులు ఇంకా ఎన్నో ఉపయోగ కరమైన సేవలను అందిస్తాయి. బ్యాంకులో డిపాజిట్ ఖాతాను తెరిచినప్పుడు మనం చాలా సులభంగా రుణాలు మరియు చెల్లింపుల సదుపాయాలను చాలా తక్కువ రుసుముతో పొందవచ్చు. మనం మరణించిన తరువాత కూడా మన డబ్బును క్లెయిమ్ చేయడానికి ఒక వ్యక్తిని నామినీగా నియమించ వచ్చు.

## నామినేషన్ అంటే ఏమిటి?

డిపాజిట్ ఖాతాదారు తన వారసుడైన ఒక వ్యక్తిని తన మరణం తరువాత బ్యాంకులో తన ఖాతాలో నిల్వ ఉన్న సొమ్మును క్లెయిమ్ చేయడానికి వీలుగా నామినీగా నియమించడం జరుగుతుంది. అలా నియమించిన నామినీకి ఆ ఖాతాదారు తదనంతరం బ్యాంకులోని సొమ్మును క్లెయిమ్ చేయడానికి వీలు కలుగుతుంది. బ్యాంకు ఖాతాకు నామినేషన్ చేయడం వలన నామినీగా నియమింపబడిన వ్యక్తి ఆ ఖాతాలోని డబ్బును సులభంగా తీసుకోవడానికి వీలు కలుగుతుంది. కాబట్టి, ప్రతి ఖాతాదారు, ఎల్లప్పుడూ నామినేషన్ సదుపాయం వినియోగించుకోవడం మంచిది.

## బ్యాంకు ఖాతాను కలిగి ఉండటం వల్ల లాభాలు ఏమిటి?




- ♦ బ్యాంకు ఖాతా ఇతర ప్రభుత్వ ఏజెన్సీలు గుర్తించడానికి వీలుగా మనకు ఒక గుర్తింపు అనేది కల్పిస్తుంది.
- ♦ బ్యాంకు ఖాతాలో లావాదేవీలు చాలా పారదర్శకంగా ఉంటాయి. అంటే మనం డిపాజిట్లు, విత్ డ్రాయల్ సౌకర్యాలు, వడ్డీరేట్లు మొదలైనవన్నీ తెలుసుకోవచ్చు.
- ♦ బ్యాంకులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తాయి. ఒకే విధమైన ఖాతాదారులందరికీ బ్యాంకు ఒకే రకమైన నిబంధనలను వర్తింపజేస్తుంది.
- ♦ బ్యాంకు ఖాతాలో మన డబ్బును దాచినట్లైతే అది భద్రంగా ఉంటుంది.
- ♦ బ్యాంకులు సేవింగ్స్, రికరింగ్ మరియు ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలను మన అవసరాలను బట్టి ప్రారంభించి, డిపాజిట్లపై వడ్డీని కూడా చెల్లిస్తాయి.
- ♦ బ్యాంకులోని మన ఖాతాలో మనకు రావలసిన వేతనాలు, జీతాలను వివిధ సంస్థలు నేరుగా జమచేయవచ్చు.
- ♦ ఇ.బి.టి. ద్వారా బ్యాంకు ఖాతాలో నేరుగా జమచేసిన ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ. వేతనాలు, పింఛనుల వంటి సామాజిక ప్రయోజనాలను మనం బ్యాంకుల ద్వారా పొందవచ్చు.
- ♦ మనకు అవసరమైనప్పుడు మనం డబ్బును బ్యాంకులో వెయ్యవచ్చు లేదా తీసుకోవచ్చు.
- ♦ అవసరం వచ్చినప్పుడు మనం బ్యాంకు నుండి రుణాన్ని పొందవచ్చు. బ్యాంకులు ఉత్పాదకత ఉద్దేశ్యంతో సముచితమైన వడ్డీ రేట్లతో రుణాలను ఇస్తాయి. మనం బ్యాంకు ఖాతాను కలిగి ఉంటే రుణాలు మంజూరు చేయడం చాలా సులభంగా ఉంటుంది.
- ♦ బ్యాంకు ద్వారా మనం అవసరమైన చెల్లింపులను చేయవచ్చు.

**బ్యాంకులో ప్రారంభించిన పొదుపు ఖాతా ఇతర అన్ని సర్వీసులను పొందటానికి కీలకమైనదిగా ఉంటుంది.**

### ఇ.బి.టి. అంటే ఏమిటి?

ఇ.బి.టి. అంటే ఎలక్ట్రానిక్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్. దీని ద్వారా ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ. వేతనాలు, వృద్ధాప్యపింఛను, వితంతు పింఛను, ఎల్.పి.జి. రాయితీకి సంబంధించిన నగదు బదిలీ వంటి సామాజిక ప్రయోజనాలను పొందవచ్చు. మధ్యవర్తుల, దళారుల ప్రమేయం లేకుండా మనకు రావలసిన డబ్బు నేరుగా మన ఖాతాలో జమ చేయబడుతుంది. ప్రస్తుతం కొనసాగుతున్న వ్యవస్థలో సంభవించే ఆలస్యాలు, మరియు పొరపాట్లు ఈ విధానంలో ఉండవు. మనం ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు మన బ్యాంకు ఖాతా నుండి డబ్బును తీసుకోవచ్చు. ఇంకా బ్యాంకు అందించే ఇతర సదుపాయాలను కూడా మనం పొందవచ్చు.

### సొమ్ము బదిలీ అంటే ఏమిటి?

దేశంలోని అనేక దూర ప్రాంతాలలో నివసించే ఇతర వ్యక్తులకు మనం డబ్బును బ్యాంకు ద్వారా పంపవచ్చు. బ్యాంకులు మన డబ్బును ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతంలోని వ్యక్తికి భద్రంగా, వేగవంతంగా మరియు సమర్థవంతంగా అందజేస్తాయి. కాబట్టి మనం బ్యాంకు ఖాతాను కలిగి ఉన్నట్లైతే మరొక నగరంలో చదువుకుంటున్న మన పిల్లల ఖాతాకు మనం చాలా సులభంగా డబ్బును బదిలీ చేయవచ్చు. దూర ప్రాంతలలో పని చేస్తున్న మన బంధువుల నుండి కూడా మనం డబ్బును అందుకోవచ్చు.

### వడ్డీ అంటే ఏమిటి?

మన డబ్బును దాచుకున్నప్పుడు దానిపై వచ్చే ఆదాయాన్ని లేదా మనం డబ్బును రుణంగా తీసుకున్నప్పుడు మనం దానిపై అదనంగా చెల్లించే మొత్తాన్ని, వడ్డీ అని పిలుస్తారు. మనం బ్యాంకులో దాచుకున్న సొమ్ము వృథాగా ఉండదు. బ్యాంకులు ఆ సొమ్మును ఇతరులకు అప్పుగా ఇస్తాయి. బ్యాంకుల నుండి ఈ సొమ్మును రుణంగా పొందిన వారు వడ్డీని చెల్లిస్తారు. ఉదాహరణకు మనం ఒక బ్యాంకులో రూ॥ 1,000/- లు డిపాజిట్ చేశామనుకుందాం. ఈ డబ్బును బ్యాంకు మరొక వ్యక్తికి అప్పుగా ఇస్తుంది. ఒక సంవత్సరానికి బ్యాంకుకు అతడు రూ॥ 100/- లు వడ్డీగా చెల్లిస్తాడు. బ్యాంకు అందులో కొంత భాగాన్ని (రూ॥ 40/- అనుకుందాం) మనకు ఇస్తుంది. రూ॥ 1,000/- లను బ్యాంకులో ఉంచినందుకు మనం ఒక సంవత్సరానికి అదనంగా పొందే సొమ్ము రూ॥ 40/- లను వడ్డీగా పిలుస్తారు.

## వడ్డీ వ్యాపారస్థులు వసూలు చేసే వడ్డీ కూడా 3 నుండి 5 శాతంగా చెప్పబడుతుంది. అటువంటప్పుడు మనం బ్యాంకులతో పోల్చితే వారికి ఎక్కువ వడ్డీ ఎందుకు చెల్లించవలసి వస్తుంది?

బ్యాంకులు వడ్డీరేటును వార్షికంగా లెక్కిస్తే, వడ్డీ వ్యాపారస్థులు వడ్డీ రేటును నెలవారీగా లెక్కిస్తారు. కాబట్టి వడ్డీ వ్యాపారస్తుడు 3% వడ్డీని పేర్కొంటే దానికి అర్థం సంవత్సరానికి 36% కానీ బ్యాంకు 12 శాతం వడ్డీ రేటును పేర్కొంటే దానికి అర్థం సంవత్సరానికి 12 శాతం అనే. అందువల్ల వడ్డీ వ్యాపారస్థులతో పోల్చితే బ్యాంకులు విధించే వడ్డీ రేటు చాలా తక్కువగా ఉంటుంది.

## డిపాజిట్ ఖాతాలలో వివిధ రకాలు ఏవి?

బ్యాంకు మూడు రకాలైన డిపాజిట్లను నిర్వహిస్తుంది.- సేవింగ్స్ డిపాజిట్(పొదుపు డిపాజిట్), టర్మ్ డిపాజిట్ (కాల వ్యవధితో కూడిన డిపాజిట్) మరియు రికరింగ్ డిపాజిట్ (ఆవృత డిపాజిట్) పై మూడింటి గురించి ఈ దిగువన పేర్కొనబడింది.

**సేవింగ్ డిపాజిట్ ఖాతా:-** ఇది మన రోజువారీ మిగులును డిపాజిట్ చేయడానికి ఉపయోగపడుతుంది. అవసరం వచ్చినప్పుడు మనం మన డబ్బును తీసుకోవచ్చు. మన పొదుపు ఖాతాపై మనం పరిమితికి మించి డబ్బు వాడుకునే సౌకర్యల (అత్యవసర రుణం ) నదుపాయాన్ని పొందవచ్చు.

**టర్మ్ డిపాజిట్ ఖాతా :-** మన అవసరాలకు తగిన కాల వ్యవధికి మనం ఈ ఖాతాలో నగదును డిపాజిట్ చేయవచ్చు. ఈ ఖాతాలో ముందే నిర్ధారించిన కాల వ్యవధికి డబ్బును దాచినట్లయితే సేవింగ్స్ ఖాతాలో వేసిన సొమ్ముపై వచ్చే వడ్డీ కంటే ఎక్కువ వడ్డీ వస్తుంది. నిర్ణీత కాల వ్యవధికంటే ముందుగానే మన డబ్బును విత్ డ్రా చేసుకోవచ్చు. కానీ మనకు వడ్డీ తక్కువగా వస్తుంది.

**రికరింగ్ డిపాజిట్ ఖాతా:-** ప్రతిరోజూ, లేదా ప్రతి వారం లేదా ప్రతినెల ఒక క్రమబద్ధమైన వ్యవధిలో ఒక మొత్తాన్ని ఖాతాలో జమచేస్తూ పోతూ ఉంటే దాన్ని రికరింగ్ డిపాజిట్ అని పిలుస్తారు. ఈ ఖాతా మనం క్రమ బద్ధంగా పొదుపు చేసిన సొమ్మును దాచడానికి వినియోగ పడుతుంది.

## మనం పొదుపు ఖాతాను ఏ విధంగా ప్రారంభించవచ్చు?

మనం పొదుపు ఖాతాను ప్రారంభించాలంటే దానికి సంబంధించిన ఫారంను పూరించడంతో పాటు "మీ వినియోగదారుని గురించి తెలుసుకోండి" (కె.వై.సి.) నిబంధనల ప్రకారం సూచించిన ధృవపత్రాలతో పాటు (గుర్తింపు కార్డు మరియు నివాస ధృవపత్రం) ఇటీవలే తీయించుకున్న ఒక ఫోటోను జతపరచవలసి ఉంటుంది.

## మన చేతిలో డబ్బులేకుండా మనం బ్యాంకు ఖాతాను ఏ విధంగా ప్రారంభించగలం?

ఇప్పుడు మనం బ్యాంకు ఖాతాను తెరవాలంటే మన చేతిలో డబ్బు ఉండవలసిన అవసరంలేదు. రిజర్వు బ్యాంకు అన్ని బ్యాంకులకు, కనీస మొత్తం లేకుండానే పొదుపు ఖాతాలను ప్రారంభించవలసిందిగా సూచనలను ఇచ్చింది. ఈ విధమైన ఖాతాలను ప్రాథమిక పొదుపు బ్యాంకు డిపాజిట్ ఖాతాగా పిలుస్తారు. ఈ డిపాజిట్‌కు కనీసం నిల్వ మొత్తాన్ని ఖాతాలో ఉంచవలసిన అవసరం లేదు.

## ప్రాథమిక పొదుపు డిపాజిట్ ఖాతా లోని అంశాలు ఏమిటి?

ప్రాథమిక పొదుపు డిపాజిట్ ఖాతా అంటే నిల్వ ఏ మాత్రం లేకుండా ప్రారంభించే పొదుపు ఖాతా. ఈ ఖాతాలో ఎన్నిసార్లు నగదును జమ చేసినప్పటికీ బ్యాంకు ఎటువంటి రుసుమునూ వసూలు చేయదు. అంతే కాక ఒక నెలలో నాలుగు సార్ల వరకు ఖాతాలో నుండి నగదును విత్ డ్రా చేయడానికి కూడా బ్యాంకు ఎటువంటి చార్జీలను విధించదు. మనకు ఒక పాస్ బుక్‌తో పాటు ఒక ఎ.టి.ఎం./స్మార్ట్ కార్డు కూడా ఉచితంగానే జారీ చేయబడుతుంది. ఈ ఖాతాను మనం డిపాజిట్, విత్ డ్రాయల్, బదిలీ, సామాజిక ప్రయోజనాల ప్రత్యక్ష జమలు మొదలైన రోజువారీ అవసరాలకు వినియోగించుకోవచ్చు.

## "మీ వినియోగదారుని గురించి తెలుసుకోండి" (కెవైసి) అంటే ఏమిటి?

"మీ వినియోగదారుని గురించి తెలుసుకోండి" నిబంధనల ప్రకారం ఖాతాలను ప్రారంభించక ముందే ఆయా వినియోగదారుల వివరాలను బ్యాంకు తెలుసుకోవలసి ఉంటుంది. ఇందుకోసం మనం అవసరమైన పత్రాలను బ్యాంకుకు సమర్పించవలసిన అవసరం ఉంటుంది. అవి ఒక ఫోటో గ్రాఫ్, గుర్తింపు ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ పత్రం. వీటన్నిటినీ ఖాతా ప్రారంభించడానికి పూర్తిచేసిన ఫారంతో పాటుగా బ్యాంకుకు సమర్పించాలి. ఈ ఖాతాను ఆధార్ కార్డు సహాయంతో కూడా ప్రారంభించవచ్చు. పై పత్రాలేవీ లేని వ్యక్తులు, ఎమ్.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ. ఉద్యోగకార్డు, లేదా స్వయం ధ్రువీకరణ వంటి సడలించబడిన విధానం ద్వారా ప్రారంభించవచ్చు. ఈ సడలించబడిన విధానంలో తెరిచిన ఖాతాలను చిన్న తరహా ఖాతాలుగా మరియు అనేక పరిమితుల విధింపులకు లోబడి అమలు చేయడం జరుగుతుంది.

## గ్రామంలో బ్యాంకు శాఖ లేనట్లయితే, మనం ఖాతాను ఏ విధంగా ప్రారంభిస్తాం?

ఇప్పుడు మనం బ్యాంకింగ్ సదుపాయాలను వినియోగించుకోవాలంటే మన ప్రాంతంలో బ్యాంకు ఉండవలసిన అవసరం లేకుండా, ఆయా బ్యాంకులు తమ వ్యాపార ప్రతినిధులను(బిసి) తమ బ్యాంకు తరపున నియమించుకుంటున్నాయి. వారు స్థానికంగా స్థిరపడి ఉన్న వారై ఆ ప్రాంతంలో ఆర్థిక ఆసక్తి ఉన్నవారు అయి ఉండాలి. వారు మన గ్రామం / చుట్టుపక్కల గ్రామాలలో బ్యాంకులు అందించే అన్ని సేవలు మనకు  అందజేస్తారు. ఈ వ్యాపార ప్రతినిధిని నియమించేటప్పుడు, బ్యాంకు అధికారులు అతనిని గ్రామ ప్రజలకు పరిచయం చేస్తారు. మనం వ్యాపార ప్రతినిధి వివరాలను గ్రామపంచాయతీ ద్వారా కూడా తెలుసుకోవచ్చు.

## వ్యాపార ప్రతినిధి అంటే ఎవరు? అతడు ఏ విధంగా పనిచేస్తాడు?

బ్యాంకులు స్థానికంగా ఆయా ప్రాంతలలో నివసించే వ్యక్తులను, లేదా ఇతరులను బ్యాంకు ప్రతినిధులుగా నియమించడానికి అనుమతి పొంది ఉంటాయి. ఈ వ్యాపార ప్రతినిధులు బ్యాంకు తరపున ఏజెంట్లుగా సేవలను అందిస్తారు. ఈ వ్యాపార ప్రతినిధి, ఐ.సి.టి.కి అనుసంధానమైన పరికరాలు స్మార్ట్ కార్డ్‌పై ఆధారపడిన పరికరాలు, మొబైల్ ఫోన్లు మొదలైన ఉపకరణాలను వాడటం ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలను నిర్వహిస్తాడు.

## ఇప్పుడు బ్యాంకు మీ ఇంటి ముందే.

## ఈ వ్యాపార ప్రతినిధి వద్ద డిపాజిట్ చేసిన మన సొమ్ము భద్రంగా ఉంటుందా?






బ్యాంకు శాఖ మనం ఉన్న ప్రాంతం నుండి దూరంగా ఉండటం వల్ల వ్యాపార ప్రతినిధి మనకు బ్యాంకింగ్ సదుపాయాలను అందజేసే ఒక సాధనంగా పనిచేస్తాడు. బ్యాంకు వ్యాపార ప్రతినిధివద్ద మన సొమ్మును డిపాజిట్ చేసినట్లైతే అది బ్యాంకులో డిపాజిట్ చేసినంత భద్రతను కలిగి ఉంటుంది. ఈ వ్యాపార ప్రతినిధి ఐ.సి.టి. ఉపకరణాల ద్వారా పూర్తిచేసిన బ్యాంకు లావాదేవీలు బ్యాంకు పుస్తకాలలోని ఖాతాలలో నమోదు చేయబడతాయి. ఖాతాదారులు వ్యాపార ప్రతినిధి ద్వారా తాము డిపాజిట్ చేసిన నగదు/తాము విత్ డ్రా చేసిన నగదు  వివరాలను తక్షణమే తనిఖీ చేసుకోవడానికి వీలుగా వ్యాపార ప్రతినిధి బ్యాంకు తరపున ఒక రశీదును జారీ చేస్తాడు. అంతేకాక, వ్యాపార ప్రతినిధి ద్వారా జరిగే బ్యాంకు లావాదేవీలు మన బయోమెట్రిక్ ఆనవాళ్ళు (మన చేతివేళ్ళ ముద్రలు మొదలైనవి) లేదా మన పిన్ నెం(వ్యక్తిగత గుర్తింపు సంఖ్య) ఆధారంగా జరుపబడతాయి.  కనుక మన ఖాతాలో ఇతరులెవరూ లావాదేవీలు చేయడానికి వీలుండదు.

## వ్యాపార ప్రతినిధులు అందించే సేవలు ఏమిటి?

ఈ వ్యాపార ప్రతినిధులు, ఓవర్ డ్రాఫ్టు, సౌకర్యంతో కూడిన పొదుపు డిపాజిట్ ఖాతా  ఫిక్స్‌డ్ డిపాజిట్ మరియు రికరింగ్ డిపాజిట్ నదుపాయాలను మనకు కల్పిస్తారు. మన ఖాతాలో నుండి డబ్బు బదిలీ మరియు మన ఖాతాలోనికి సొమ్ము స్వీకరణల వంటి లావాదేవీలను అనుమతిస్తారు. అంతేకాక, వారు వ్యవసాయ పనులకోసం కిసాన్ క్రెడిట్ కార్డులు మరియు వ్యవసాయేతర ఆదాయాన్ని పెంచుకొనే విధంగా జనరల్ పర్పస్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలను ఏర్పాటు చేస్తారు.

## ఓవర్ డ్రాఫ్టు అంటే ఏమిటి? ఇతర రుణాలకు, ఓవర్ డ్రాఫ్టుకూ ఉన్న తేడా ఏమిటి?

వివిధ అత్యవసరాలను కొద్ది మొత్తం ఓవర్ డ్రాఫ్టుతో కూడిన బ్యాంకు పొదుపు ఖాతా తీరుస్తుంది. ఖాతా మొత్తం మీద ఓవర్ డ్రాఫ్టును పరిమితికి మించకుండా తీసుకోవడానికి ఎటువంటి ప్రత్యేక పత్రాలను సమర్పించే అవసరం లేదు. అందువలన, ఈ నదుపాయం అత్యవసర పరిస్థితులలో సమయానికి ఉపయోగపడుతుంది. ఈ విధంగా తీసుకున్న ఓవర్ డ్రాఫ్టు పై మనం బ్యాంకు లోన్ లపై చెల్లించిన విధంగా వడ్డీని చెల్లించవలసి ఉంటుంది. కె.సి.సి. మరియు జి.సి.సి. వంటి ఇతర రుణాలను ఆదాయవనరులను పెంచుకోవడానికి ప్రత్యేక అవసరాలకోసం బ్యాంకులు మంజూరు చేస్తాయి.

# ఋణాలు

## ఆదాయానికి అప్పుకు మధ్య తేడా ఏమిటి?

ప్రతిఒక్క అప్పు లేదా ఋణాన్ని తిరిగి చెల్లించవలసి ఉంటుంది. ఈ డబ్బును మనం సంపాదించిన సొమ్ము లేదా ఆదాయంగా పరిగణించలేం. మనం మన జీతం లేదా వేతనాలు మొదలైన వాటి ద్వారా సంపాదించినది ఆదాయం అవుతుంది. కానీ, అప్పు లేదా ఋణం మన ఆదాయాలుగా పరిగణించలేము. అంతేగాక వాయిదాలలో చెల్లించడం అనేది ఖర్చు కిందికి వస్తుంది.

## మనం ఎప్పుడు అప్పు చేస్తాం?

అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు లేదా మన ఖర్చులు మనకు వచ్చే ఆదాయాన్ని మించిపోయినప్పుడు మనం అప్పు చేస్తాం. మనం ఏవైనా వ్యాపారాలను చేపట్టాలన్నా కూడా మనకు అవసరమైన డబ్బును అప్పు రూపంలో బ్యాంకు నుండి తీసుకుంటాం.

## మన దగ్గర డబ్బు కొరత ఏర్పడిన ప్రతిసారీ మనం అప్పు తీసుకోవచ్చా?

పండుగలను జరుపుకోవడం, వైభవంగా వివాహాలు చేయడం, నగలు లేదా ఖరీదైన వినియోగ వస్తువులను కొనుగోలు చేయడానికి అప్పులు చేయకూడదు. ఇటువంటి వస్తువులను కొనుగోలు చేయవలసి వస్తే, మన ఆదాయం నుండి గానీ, లేదా మనం కూడబెట్టిన సొమ్ముతో గానీ కొనుగోలు చేయాలి. రోజువారీ వినియోగ ఖర్చులకు మన ప్రస్తుత ఆదాయం లేదా పొదుపు సొమ్మును గానీ వినియోగించాలి. మనకు ఎప్పుడైనా వినియోగ ఖర్చులకోసం తప్పనిసరి పరిస్థితులలో అప్పు చేయవలసి వస్తే మనం ప్రస్తుతం సంపాదించే ఆదాయంనుండి ప్రతినెలా ఎంతమొత్తాన్ని అప్పు తీర్చడానికి కేటాయించగలమో అంచనా వేసుకోవాలి




వినియోగ ఖర్చులవల్ల ఎటువంటి ఆదాయమూ రాదు. అటువంటప్పుడు మనం అప్పును తిరిగి ఏ విధంగా చెల్లించగలం? మరొకవైపు మొదట చేసిన అప్పులను తీర్చడానికి మనం వివిధ వనరుల నుండి మళ్ళీ మళ్ళీ అప్పులు చేస్తూ ఉండటంతో అప్పుల ఊబిలో చిక్కుకు పోతాం.

**అప్పులను త్వరగా తీర్చాలని తెలుసుకోండి. లేకుంటే, ఆ అప్పే మిమ్మల్ని ఆపదలపాలు చేస్తుంది.**

## ఎందుకు మనం ఆదాయాన్ని పెంచుకోవడానికి మాత్రమే అప్పుచేయాలి ?

మనం ఒక అప్పు చేసినప్పుడు, ఆ అప్పును మనం వడ్డీతో సహా తీర్చవలసి ఉంటుందన్న సత్యాన్ని, గ్రహించాలి. ఎప్పుడూ కూడా మన తిరిగి చెల్లింపు సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అప్పు చేయాలి.

మనం ఏదైనా వ్యాపారాన్ని చేపడితే అది మన ఆదాయాన్ని పెంచుతుంది. కాబట్టి వ్యాపారం పై వచ్చే ఆదాయంతో మన అప్పును తీర్చే అవకాశం ఉంటుంది. ఉదా॥ మనం ఒక బ్యాంకు నుండి విత్తనాలు కొనుక్కోవడానికి రూ॥ 1000/- లను అప్పు చేశామనుకుందాం. మనకు రూ॥ 10,000/- ల ఆదాయం వస్తే మనం అప్పుకు చెల్లించవలసిన మొత్తం వడ్డీతో సహా 1000+100= రూ॥ 1100/-లు పోగా మిగిలిన రూ॥ 8,900/-లను ఆదాయంగా పరిగణించవచ్చు. ఒక వ్యాపారం మనం ప్రారంభిస్తే దానిపై ఆదాయం చెల్లించవలసిన అసలు మరియు వడ్డీ కన్నా ఎక్కువ మొత్తంలో ఉండాలి. లేనట్లయితే మనం మొదటగా చేసిన అప్పులను తీర్చడానికి తిరిగి అప్పులను చేయవలసి ఉంటుంది.




**ఒక వ్యాపారాన్ని ప్రారంభించడానికి అప్పు చేసినట్లయితే మన ఆదాయం పెరుగుతుంది. మనం ఆదాయం పెరిగే కార్యకలాపాలకు మాత్రమే అప్పుచేయాలి. పరిమితికి మించకుండా మాత్రమే అప్పులను ఎందుకు చేయాలి?**

మనం ఏ విధమైన అప్పు చేసినా దాన్ని వడ్డీతో సహా తీర్చవలసి ఉంటుంది. అప్పు చేయడానికి ముందుగా మనకు చాలినంత ఆదాయం ఉందని నిర్ధారించుకోవాలి. మన అప్పు చెల్లింపు నెలవారీ వాయిదా మొత్తం కంటే మనం పొదుపు చేసే మొత్తం ఎక్కువగా ఉండాలి.

## బ్యాంకుల నుండి రుణాలను పొందడం

### వడ్డీ వ్యాపారుల వంటి అనధికార రుణ వనరులు అందుబాటులో ఉండగా బ్యాంకుల నుండే ఎందుకు రుణాలు పొందాలి.

బ్యాంకులనుండి అప్పులు తీసుకునే ప్రక్రియలో, ఒక్కొక్కప్పుడు వడ్డీ వ్యాపారస్థుల వంటి ఇతర వనరుల నుండి రుణాలు పొందడం కంటే కూడా కొద్దిగా జాప్యం చోటు చేసుకున్నప్పటికీ, బ్యాంకులే రుణాలు తీసుకోవడానికి అనువైన వనరులు. బ్యాంకు భద్రతతో కూడిన, విశ్వసనీయమైన, పారదర్శకమైన సంస్థగా సముచితమైన నిబంధనలతో కూడిన రుణ స్వీకరణకు తోడ్పడుతుంది. బ్యాంకులు భారతీయ రిజర్వు బ్యాంకు ద్వారా క్రమబద్ధీకరించబడతాయి. అనధికార వనరులైన బంధువులు, స్నేహితులు, వడ్డీ వ్యాపారస్థులు, విషి, ముఖియ వంటి వారితో పోల్చితే బ్యాంకులు చాలా తక్కువ వడ్డీని వసూలు చేస్తాయి. అంతేకాక, బ్యాంకులు అప్పు మొత్తాన్ని విడుదల చేసే ముందే మొత్తం పత్రాలను పకడ్బందీగా తయారు చేస్తాయి. ఏదైనా వివాదం తలెత్తిన సందర్భంలో, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం కూడా అందుబాటులో ఉంటుంది.




**బ్యాంకులు పారదర్శకమైనవిగా ఉండి అతితక్కువ వడ్డీని వసూలు చేస్తాయి.**

### బ్యాంకులు నిర్వహించే ఫిర్యాదుల పరిష్కరణ యంత్రాంగం అంటే ఏమిటి?

బ్యాంకులు క్రమబద్ధీకరించబడిన ప్రతిపత్తిని కలిగి ఉంటాయి. ప్రతిఒక్క బ్యాంకు ఒక ఫిర్యాదుల పరిష్కరణ అధికారిని కలిగి ఉండి, ఆ అధికారి యొక్క వివరాలు అన్ని శాఖలలోను మరియు బ్యాంకు వెబ్‌సైట్లలోను పొందుపరచబడి ఉంటాయి. ఏదైనా వివాదం తలెత్తినప్పుడు, మనం మన ఫిర్యాదును ఆ బ్యాంకు యొక్క ఫిర్యాదుల పరిష్కరణ అధికారికి సమర్పించాలి. మనకు ఆ వివాదంలో ఆ అధికారి తీర్మానం సంతృప్తిని కలిగించక పోయినట్లైతే, మనం మన ఫిర్యాదును భారతీయ రిజర్వు బ్యాంకు యొక్క బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌కు సమర్పించవచ్చు.

## అనధికార రుణవనరులకు కూడా ఫిర్యాదుల పరిష్కరణ యంత్రాంగం అందుబాటులో ఉంటుందా?

అనధికార రుణ వనరులు క్రమబద్ధీకరించబడినవి కావు కనుక వాటికి సంబంధించిన ఫిర్యాదుల పరిష్కరణ యంత్రాంగం ఉండదు.

## వడ్డీ వ్యాపారస్థులతో పోల్చితే బ్యాంకుల నుండి రుణాలు పొందటంలో ఎందువల్ల జాప్యం జరుగుతుంది?

బ్యాంకులు ప్రజలవద్ద నుండి డిపాజిట్లను సేకరించి, ఆ డబ్బును అవసరం ఉన్న ప్రజలకు అప్పుగా ఇస్తాయి. డిపాజిట్ దారు సొమ్ముకు భద్రత కల్పించే క్రమంలో బ్యాంకులు రుణ గ్రహీత ఆ రుణం మొత్తాన్ని సరైన కారణం కోసం వినియోగిస్తున్నదీ లేనిదీ పరిశీలించవలసి ఉంటుంది. కాబట్టి రుణాలను మంజూరు చేసే ముందుగానే, అప్పు ప్రతిపాదనను క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. ఇందుకోసం కొంత సమయం తీసుకున్నప్పటికీ, ప్రతిఒక్క అంశం లిఖిత పూర్వకంగా పత్రాల రూపంలో ఉండటంతో రుణగ్రహీతలు మోసపోయే అవకాశం లేదు. వాస్తవంగా ఇది డిపాజిట్ దారులు మరియు రుణగ్రహీతల ప్రయోజనాలకి సంబంధించిన విషయం.

## బ్యాంకులు ఏ విధమైన రుణాలను ఇస్తాయి.

బ్యాంకులు ఇళ్ళ నిర్మాణం, పిల్లల చదువు, వ్యవసాయం మరియు సంబంధిత అవసరాలు, ఒక వ్యాపారాన్ని ఆరంభించడం, వినియోగ రుణాలు మొదలైన వాటికి రుణ




అన్నిరకాల రుణ అవసరాలకు ఉపయోగపడతాయి.

**బ్యాంకు మీ రుణ అవసరాలన్నీ తీరుస్తుంది.**

## నేను బ్యాంకు నుండి ఏ విధంగా రుణాన్ని పొందగలను?

రుణం అవసరమైన కారణాన్ని పేర్కొంటూ మనం దరఖాస్తును బ్యాంకుకు సమర్పించాలి. అప్పుడు బ్యాంకు దరఖాస్తులో పేర్కొన్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, మన అప్పు చెల్లింపు సామర్థ్యాన్ని మదింపు చేసి, బ్యాంకు సూచించిన విధంగా వాయిదాలలో వడ్డీతో సహా తిరిగి చెల్లించే రుణాన్ని మంజూరు చేస్తుంది.

## బ్యాంకులనుండి రుణాన్ని పొందటానికి అయ్యే ఖర్చు ఎంత?

మనం తీసుకున్న రుణంపై చెల్లించే వడ్డీనే మనం బ్యాంకుకు చెల్లించే ఛార్జీ బ్యాంకులు సాధారణంగా వడ్డీరేటును సంవత్సరం కాలవ్యవధికి పేర్కొంటాయి. ఉదా॥ వార్షిక వడ్డీరేట్లు 12 శాతంగా బ్యాంకు పేర్కొని ఉంటే నెలవారీ వడ్డీ 1% రుణవ్యయం నిర్ణయించడంలో చక్రవడ్డీ కాలవ్యవధి కూడా ఒక ముఖ్యాంశం. ఇతర అనధికార వడ్డీ వ్యాపార వనరుల మాదిరిగా రుణ వ్యయం దాచకుండా బ్యాంకులు తాము వివిధ అవసరాలకు ఇచ్చే రుణాలపై విధించే వడ్డీ రేట్లు మరియు ఇతర ఛార్జీలు ప్రజలకు బహిరంగంగా ప్రకటిస్తాయి. అంతే కాక, బ్యాంకులు ఒకే విధమైన ఖాతాదారులకు ఒకే విధమైన అవసరాలకు ఒకే విధంగా రుసుమును వసూలు చేస్తాయి.

## రుణం కోసం మనం ఏదైనా హామీని చూపాలా?

మనం ఏవిధమైన అప్పు ఏ అవసరానికి తీసుకొంటున్నామో, దానిపై హామీ ఆధారపడి ఉంటుంది. సాధారణంగా చిన్న చిన్న రుణాలకు హామీ అవసరం లేదు. అయితే పెద్ద మొత్తాలకు మనం ఏదైనా హామీని బ్యాంకుకు సమర్పించవలసి ఉంటుంది.

## మనం రుణాన్ని ఎందుకు తిరిగి చెల్లించాలి?

బ్యాంకు తన వద్ద గల డిపాజిట్ దారుల డబ్బును అప్పుగా మంజూరు చేస్తుంది. మనం తిరిగి చెల్లించక పోయినట్టైతే, బ్యాంకు యొక్క ఆర్థిక పరిస్థితి బలహీన పడుతుంది. ఇది బ్యాంకు తన డిపాజిట్ దారులకు వారు డిపాజిట్ చేసిన మొత్తాలను చెల్లించే అవకాశాన్ని దెబ్బ తీస్తుంది. బ్యాంకు రుణాలను పొందిన వారంతా ఈ విధంగా అప్పు తీర్చకుండా ఉన్నట్టైతే, అటువంటి సందర్భాలలో బ్యాంకులో డబ్బుదాచిన మనం లేదా మన బంధువులు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఇంకా బ్యాంకు రుణాలు కోరిన మరికొంత మందికి కూడా రుణాలను మంజూరు చేయవలసి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే, మనం తీసుకున్న అప్పును మనం క్రమం తప్పకుండా వాయిదాల రూపంలో చెల్లించినట్లయితేనే, భవిష్యత్తులో మనకు మరిన్ని బ్యాంకు రుణాలను పొందే అవకాశం ఉంటుంది.

## మనం బ్యాంకు నుండి పొందిన రుణాన్ని తిరిగి చెల్లించకపోతే ఏం జరుగుతుంది?

మనం రుణాన్ని తిరిగి చెల్లించని సందర్భంలో అప్పుకు మనం హామీగా ఉంచిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి బ్యాంకుకు హక్కు ఉంటుంది. అంతేకాక, బ్యాంకు చట్టపరంగా మనకు వ్యతిరేకంగా లావాదేవీలను నడిపి వడ్డీతో సహా అప్పు వసూలు చేసుకుంటుంది.

# ముఖ్య విషయములు

## ముఖ్య విషయములు

# భారతీయ రిజర్వు బ్యాంకు

## డిశె నిరాకరణ:

సాధారణ వ్యక్తికి సమాచారము మరియు మార్గనిర్దేశము చేయుట భారతీయ రిజర్వు బ్యాంకు యొక్క ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమాల ముఖ్య ఉద్దేశం. ఈ సంచిక బ్యాంకింగ్ విషయాల గురించి ప్రజలకు సులువుగా పరిచయం చేయుటకు ఉద్దేశింపబడినది, కానీ ఇవి న్యాయ, సాంకేతిక వివరణలు కావు వీటిని ఉపయోగించే వారు, వారి సొంత వివేచనతో. జాగ్రత్తలను తీసుకోవాలి. ప్రచురణలలో తప్పులు రాకుండా, పదాలను వదలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడమైనది. అయినప్పటికీ ఏమైనా పొరపాట్లు, లోపాలు, గమనించినట్లయితే పైన పొందుపరచిన అడ్రస్సుకు తెలియజేయవచ్చు. తరవాతి సంచికలలో ఆ తప్పులను సరిదిద్దడం జరుగుతుంది. ఈ సందర్భంగా తెలియచేయడమేమనగా దీని వాడుకలో కలిగే ఏవిధమైన పొరపాట్లకు, నష్టాలకు, లోపాలకు ప్రచురణ కర్త బాధ్యుడు కాదు.

# బ్యాంకులో అడుగు పెట్టండి - పేదరికం నుండి బయట పడండి.

... ఇప్పుడు




... అప్పుడు

భారతీయ రిజర్వ్ బ్యాంకు